క్లుప్తంగా

నేడు కవి సమ్మేళనం

చిత్తూరు రూరల్: ఉగాదిని పురస్కరించుకుని గురుజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కవిసమ్మేళనం, ఉగాది పురస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ నిర్వాహకులు హరిక్రిష్టారెడ్డి తెలిపారు. నగరంలోని రెడ్డిభవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుందన్నారు. కవులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా ఉగాది సంబరాలు

చిత్తూరు రూరల్: నగరంలోని రెవెన్యూ భవనంలో సోమవారం హరివిల్లు లలిత కళా వేదిక ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. కవి సమ్మేళనం నిర్వహించి, ఉగాది పురస్కారాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సభ్యులు సియాన్ చంద్రశేఖర్, పద్మనాభ పిళ్ళై, హరి నాయుడు, బాలరాజు పాల్గొన్నారు.

నేడు పోషణ అభియాన్ వారోత్సవం

చిత్తూరు రూరల్: నగరంలోని కొంగారెడ్డిపల్లి ప్రాంతంలో ఉన్న సీడీపీఓ కార్యాలయంలో మంగళవారం పోషణ అభియాన్ వారోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి తెలిపారు. ఉదయం 11 గంటలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం కార్యాలయంలో సమావేశం ఉంటుందని, అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. స్వయంభు మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు దోష నివారణ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీసీఆర్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ టీచర్‌పై ఏడవ తరగతి విద్యార్థి తల్లిదండ్రులు సోమవారం హెచ్‌ఎం మీనాక్షికి ఫిర్యాదు చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా విచారణ చేస్తామన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు నిజమని తేలితే ఖచ్చితంగా సంబంధిత టీచర్ పై శాఖాపరంగా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో లిఖిత పూర్వకంగా సమస్యలు తెలియజేవచ్చని హెచ్‌ఎం విలేకరులకు వెల్లడించారు.

దారి సమస్య పరిష్కారం



దారి కల్పిస్తున్న అధికారులు

పూతలపట్టు: మండలంలోని కొర్లమిట్టకు చెందిన చంద్రమ్మ దారి సమస్యపై స్పందనలో తహసీల్దార్ విజయభాస్కర్‌కు సోమవారం అర్జీ సమర్పించింది. ఆమె స్థలాన్ని ఎవరో ఆక్రమించుకున్నారని ఆ వినతిలో పేర్కొంది. వెంటనే తహసీల్దార్‌తోపాటు ఎస్సై హరిప్రసాద్, ఎంపీడీఓ గౌరి కలిసి దారి సమస్యను పరిష్కరించారు.

స్థల పరిశీలన

పూతలపట్టు: మండలంలోని బండపల్లిలో డంపింగ్‌యార్డుకు అవసరమైన స్థలాన్ని సోమవారం ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్ కలిసి పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించిన అనంతరం వాటిని ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామానికి డంపింగ్ యార్డు ఉన్నందువల్ల అధిక లాభాలు ఉంటాయని అధికారులు గ్రామస్తులకు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

యాదమరి: మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడ ఉర్దూ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఉదయం పాఠశాలలో సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎంఈఓ రుక్మిణీ మాట్లాడుతూ విద్యార్థులు ఆందోళన చెందకుండ పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ రావు, యాదమరి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంప్

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేసింది. వీటికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మండలంలోని పానాటూరు, వసంతాపురం గ్రామ సచివాలయాల్లో ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. 2014 ముందు ఆధార్‌కార్డులు పొంది ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోని వారిని వలంటీర్లు గుర్తించి ఆధార్ క్యాంప్‌లకు పంపుతున్నారు. 21, 27, 28, 29 తేదీల్లో ఆధార్ క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉపేంద్ర తెలిపారు.

పొలంబడి.. ప్రయోగాల సవ్వడి

- సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో వరి సాగు
- జీఏపీ కింద నాలుగు గ్రామాలు ఎంపిక
- రైతుల్లో విశేష స్పందన



పొలంబడిలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళెం: వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులను అవలంభించి భూసార సంరక్షణ, ఆరోగ్యకరమైన దిగుబడులను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమమే పొలంబడి. పొలంలో 30 మంది రైతులను సమావేశపరచి పంట సాగులో వస్తున్న మార్పులను పరిశీలించి చర్చిస్తారు. సమగ్ర పంట యాజమాన్యాలను అమలుపరస్తూ ఆర్థికంగా లాభదాయకమైన నిర్ణయాలతో సేంద్రియ వ్యవసాయం దిశగా రైతులను మళ్లిస్తూ రైతు సాధికారతను సాధించడమే డాక్టర్ వైఎస్సార్ పొలంబడి లక్ష్యం.

జీఏపీతో 100 హెక్టార్లలో వరి సాగు

మండలంలో రాగిమానుపెంట, వెలుతురుచేను, కీరమంద, టేకుమంద గ్రామ పంచాయతీల పరిధిలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా జీఏపీ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్) పద్ధతులను అనుసరించి 100 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. గ్రామాల్లో ఎంపిక చేసిన 30 మంది రైతులతో వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా చేస్తున్న సాంద్ర వ్యవసాయ విధానం పట్ల రైతుల్లో ఆసక్తి, అవగాహన పెంపొందిస్తున్నారు.

పొలంబడి విధానాలు

- ఒక రైతుకు చెందిన 2 ఎకరాల విస్తీర్ణం సేకరించడం
- అందులో సేంద్రియ పద్ధతిలో 14 వారాల పాటు సాగు చేయడం
- విత్తన శుద్ధి ద్వారా పురుగులు, తెగుళ్ల ఉధృతి తగ్గించడం
- నారుకొనలు తుంచి నాటడం ద్వారా కాండం తొలిచే పురుగును నివారించడం
- కాలిబాటలు తీయడం ద్వారా దోమపోటు నివారించడం
- ఎరువుల వాడకం, పైరును నష్టపరిచే పురుగులను గుర్తించడం
- సహజ పద్ధతుల ద్వారా పురుగులు, తెగుళ్ల నివారించడం
- చుట్టుపక్కల రైతులకు సేంద్రియ వ్యవసాయంపై చైతన్యం కలిగించడం
- సాగులో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించడం
- రైతులకు సాగు ఖర్చు తగ్గించి, అధిక దిగుబడి, ఆదాయం కల్పించడం

జీఏపీ సర్టిఫికేషన్

పొలంబడి కార్యక్రమం ద్వారా సేంద్రియ పద్ధతులను అనుసరించి పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు వ్యవసాయశాఖ జీఏపీ (గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్) సర్టిఫికేషన్‌ను అందిస్తోంది. దాంతో రైతులు సేంద్రియ ఉత్పత్తులను విక్రయించడం ద్వారా మంచి ఆదాయాన్ని ఆర్జించేందుకు అవకాశం ఉంటుంది.

విశేష స్పందన

గ్రామాల్లో వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. రైతులు 30 మంది సేంద్రియ సాగు విధానాలను తెలుసుకుంటూ, అనుమానాలను నివృత్తి చేసుకుంటూ పొలంబడిలో పాల్గొంటున్నారు. ఖరీఫ్ సీజన్లో మరింత విస్తీర్ణంలో సాగు చేపడతామంటూ రైతులు చెబుతున్నారు.

పొలంబడితో ప్రయోజనాలు

డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సేంద్రియ విధానాన్ని వ్యవసాయంలో భాగం చేసేందుకు కృషి చేస్తున్నారు. సమగ్ర సస్యరక్షణలో భాగంగా సాగు ఖర్చులను తగ్గించడం, పంట దిగుబడులను స్థిరీకరించేందుకు ఈ పొలంబడి ఉపయోగపడుతోంది. ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను మానవాళికి అందించడం మరో లక్ష్యం. పర్యావరణ పరిరక్షణకు, నిర్ణయాత్మక శక్తిగా, శాస్త్రీయ నైపుణ్యత పొందిన రైతు సాధికారతను సాధించాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం.

పొలంబడితో ఎంతో మేలు



ప్రభుత్వం వ్యవసాయశాఖ ద్వారా డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మా గ్రామంలో అమలు చేస్తోంది. దీన్ని వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. వారం వారం పొలంబడి కార్యక్రమంలో జీఏపీ పద్ధతుల ద్వారా పెట్టుబడులు తగ్గించుకుని, దిగుబడులు ఎలా పెంచుకోవాలో తెలుసుకుంటున్నాం. సేంద్రియ విధానంతో ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకు ఇదో మార్గంగా ఉపయోగపడుతోంది.

– అన్నాదురై, రైతు, పులిమడుగు గ్రామం

రైతుల్లో చైతన్యం రావాలి



మండలంలో రాగిమానుపెంట, వెతుతురుచేను, కీమమంద, టేకుమంద గ్రామాలను పొలంబడి జీఏపీ కింద ఎంపిక చేశాం. రైతులకు సేంద్రియ పద్ధతులపై చైతన్యం రావాలి. వ్యవసాయంలో సమగ్ర మార్పులను తీసుకువచ్చి లాభసాటిగా మార్చాలనేది ప్రభుత్వ ఆశయం. ఈ దిశగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పద్మజ, వ్యవసాయాధికారి, బంగారుపాళెం

ఆసక్తి పెరుగుతోంది



ఈ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. సాగులో పెట్టుబడులను తగ్గించి, అధిక దిగుబడి, లాభాలను సాధించి రైతుల్లో ఆర్థిక సాధికారత తీసుకువచ్చేందుకు అవగాహన కల్పిస్తున్నాం. సేంద్రియ వ్యవసాయం పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను ఇస్తున్నాం.

– మధుసూదన్‌రెడ్డి, ఏడీఏ, చిత్తూరు

అన్నదానాన్ని అడ్డుకోవడం దారుణం

చిత్తూరు రూరల్: సేవా భావంతో పేదలకు చేపడుతున్న అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు అడ్డుకోవడం దారుణమని జెపీ వెల్‌నెస్ ఫౌండేషన్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనవరి 18వ తేది నుంచి కుప్పం నియోజకవర్గం శాంతిపురం జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రభుత్వ స్థలంలో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. రోజుకు 200 నుంచి 300 మంది వరకు అన్నదానం చేస్తున్నామన్నారు. అయితే ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు టెంట్లు కూల్చివేశారన్నారు.దళితులంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారని చెప్పారు. దీనిపై అధికారులపై ఫిర్యాదు చేస్తే నోటీసులతో సరిపెట్టారన్నారు. దీంతో ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో సభ్యులు జయప్రకాష్, డీవి మునిరత్నం, వేలయుధం మణి, రాజేశ్వరి దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

చిత్తూరు రూరల్: సెకండ్ బ్యాచ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఎన్‌ఎం యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఏఎన్‌ఎంలు నిరసన తెలిపారు. సాంబశివ మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 60 మంది సచివాలయ ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్నారన్నారు. వీరిని రెగులర్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని తెలిపారు. అనంతరం ఏఓ రమేష్‌బాబుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సత్యమూర్తి, బాలాజీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలకు పూర్తి పరిష్కారం



చిత్తూరు: స్పందన కార్యక్రమంలో వినతులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ



బంగారుపాళెం: తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

చిత్తూరు అర్బన్ : స్పందన కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి పూర్తిస్థాయిలో పరిష్కరించాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. స్పందన వినతుల పరిష్కారంపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతి పత్రాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి నివేదించాలన్నారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ–2, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్, మెప్మా ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఐదు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డా.లోకేష్, ఎంఈ ధనలక్ష్మీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

దారి చూపండి

బంగారుపాళెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. మండలంలోని తుంబుగానిపల్లె గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లే దారి సమస్యను పరిష్కరించాలంటూ తహసీల్దార్ బెన్నురాజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రైతులు ఆన్‌లైన్‌లో భూమికి సంబంధించిన వివరాలు నమోదు కాలేదని, ఇంటి స్థలాల సమస్యను పరిష్కరించాలని వినతులు అందజేశారు. సమస్యలపై స్పందించిన తహసీల్దార్ వీఆర్‌ఓల ద్వారా విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇబ్రహీం, సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి వినతి

తవణంపల్లె: భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు పలువురు రైతులు వినతి పత్రం సమర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. మండలంలోని పైపల్లెకు చెందిన మునిరత్నం రెడ్డి తన తండ్రి పేరుతో ఉన్న భూమి రికార్డులను తమ కొడుకుల పేరుపై మార్పు చేయాలని కోరారు. కొంత మంది రైతులు పాసు పుస్తకాల్లో తమ భూమి వివరాలను నమోదు చేయాలని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆధార్ కార్డులో తప్పులు సవరించాలని మరి కొందరు విజ్ఞప్తి చేశారు.

శ్మశానవాటికలో గ్రానైట్ వ్యర్థాలపై ఫిర్యాదు



తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించిన కాలనీ వాసులు

చిత్తూరు రూరల్: శ్మశానభూమిలో గ్రానైట్ వ్యర్థాలను పడేస్తున్నారని అనుపల్లిలోని విజయనగర్ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు సోమవారం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలోని అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. తరతరాలుగా గంగాసాగరంలోని ప్రభుత్వ భూమిని శ్మశానవాటికగా వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఆ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకునేందుకు గ్రానైట్ వ్యర్థాలను అందులో పడేస్తున్నారని చెప్పారు. సర్వే చేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పినట్లు వారు తెలిపారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

తవణంపల్లె: మండలంలో త్రైత సిద్ధాంత భవద్గీత, మన పండుగలు, సంప్రదాయాలపై విస్తృతంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ప్రచారం చేసింది. కమిటీ సభ్యులు సోమవారం మండలంలోని గొల్లపల్లెతో పాటు పలు గ్రామాల్లో ప్రచారం చేస్తూ, ఉగాది క్యాలెండర్లను పంపిణీ చేశారు. మొట్టమొదట జరుపుకొనే ఉగాది పండుగను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి సభ్యులు ధనంజయ, మునిరత్నం, ఛటర్జీ, హర్షవర్దన్, లత, విమలమ్మ, ఛాముండి, లలిత, సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తిరునాళ్లు



ముస్తాబవుతున్న శ్రీ కొమ్మేపెళ్లమ్మ ఆలయం

యాదమరి: మండలంలోని ఎర్రచేను పంచాయతీ అడవిలో వెలసిన శ్రీ కొమ్మేపెళ్లమ్మ తిరునాళ్లు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ టి.పద్మనాభ రెడ్డి తెలిపారు. ఆలయం వద్ద విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లు, అరటి చెట్లు, టెంకాయి ఆకులతో మండపాలు సిద్ధం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ధ్వజారోహణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు, రాత్రి జ్యోత్న భాగవతారిణీచే రామాయణ హరికథను ఆలపించనున్నట్లు తెలిపారు. 22న వేకువజామున 4 గంటలకు అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. 23, 24 తేదీలలో ఆలయం వద్ద హరికథలు, చెక్కభజనలు, వీధి నాటకాలు, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మామిడిలో తెగుళ్ల నివారణకు చర్యలు





బంగారుపాళెం: మామిడితోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖఅధికారి మధుసూదన్‌రెడ్డి, గుడిపాల: పొలంబడి కార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు

తవణంపల్లె/బంగారుపాళెం/ఐరాల : మామిడి పంటలో తెగుళ్ల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. తవణంపల్లె మండలంలోని పట్నంలో, బంగారుపాళెం మండలంలోని నలగాంపల్లెలో సోమవారం తిరుపతి ఉద్యాన పరిశోధనా స్థానం, చిత్తూరు డాట్ సెంటర్ కీటక శాస్త్రవేత్తలు శ్రీనివాసులురెడ్డి, రాఘవేంద్రలతో కలసి మధుసూదన్‌రెడ్డి మామిడితోటలను పరిశీలించారు. నల్ల తామర పురుగు పంటను ఆశిస్తున్నట్లు గుర్తించారు. పురుగులు కాయలపై గోకడంతో గార ఏర్పడిందని తెలిపారు. వర్షం పడడంతో ఈ పురుగుల బెడద కొంత వరకు తగ్గిందని చెప్పారు. అయితే కాయ సైజు పెరగకుండా రాలిపోతుందని చెప్పారు. గత సంవత్సరం ఈ పురుగు మిరపతోటలను ఆశించి నట్లు గుర్తుచేశారు. రైతులు మందు జాగ్రత్తగా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు నల్ల తామర పురుగు నివారణకు లీటరు నీటిలో అసిఫేట్ 1.5 గ్రాములు, వేపనూనె 2 ఎంఎల్, బావిస్టిన్ 1 గ్రాము మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాయలు ఎక్కువగా రాలిపోతున్న తోటల్లో ఫ్లానోఫిక్స్‌మందు 1 గ్రామును 4.5 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. కాయదశలో పంటను ఆశించే కీటకాల నివారణకు ఉద్యానశాఖ అధికారుల సూచనలు సలహాలను పాటించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. తిరుపతి నిమ్మ పరిశోధన స్థానం కీటక శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, డాట్ సెంటర్ కీటక శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ జిల్లాలో నల్ల తామర వృద్ధిపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సాగరిక, గ్రామ ఉద్యాన సహాయకులు శంకర్, కోకిల, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

గుడిపాల: ప్రకృతి వ్యవసాయ విధానాలతో భూమి సారవంతం అవుతుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పానాటూరు రైతుభరోసా కేంద్రానికి సంబంధించి సోమవారం రైతులకు పొంంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు భూసారం కోల్పోతుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. రబీ 2022లో ఈ–పంట నమోదు, ఈకేవైసీ, సామాజిక తనిఖీ గ్రామసభలో పాల్గొని పంటనమోదు చేసుకున్న రైతుల పేర్లు చదివి వినిపించారు. అకాల వర్షానికి పంటల నష్టం జరిగి ఉంటే వెంటనే తెలియజేయాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, సహాయకులు తులసీరాంరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు మెరుగైన వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చుక్కావారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రపరుచుకునే విధానం, దాని ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దంత పరిశుభ్రతపై అవగాహన

బంగారుపాళెం: విద్యార్థులు దంత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కీరమంద ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ నోటి పరిశుభ్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నోటి పరిశుభ్రత, దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు టూత్‌బ్రష్‌లు, పేస్టు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, మస్తానీ, బృంద, సంస్థ ప్రతినిధులు గుణశేఖర్, దాము, మాదవ, దేవదాసు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే చదువు

తవణంపల్లె: విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదవగలరని వైద్యాధికారి దాత్రేయచౌదరి తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పుణ్యసముద్రంలో 104 శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అప్పుడే చదువుపై దృష్టి పెట్టగలరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన

యాదమరి: గ్రామీణ ప్రజలు, కూలీలు ఈ ఎండల్లో తిరిగితే వచ్చే వడదెబ్బపై అవగాహన కల్పించినట్లు స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని కీనాటపల్లె ఆరోగ్య ఉపకేంద్రంలో గ్రామీణ ప్రజలకు సమావేశం నిర్వహించారు. మండుటెండల్లో తిరగరాదని చెప్పారు. కూలీలు ఉదయం 10 గంటల వరకు, సాయత్రం 4 గంటల తరువాత పనులకు వెళ్లాలన్నారు. ఆసుపత్రి సిబ్బంది తమ వెంట ఎప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.







యాదమరి: గ్రామస్తులకు వివరిస్తున్న వైద్యులు, బంగారుపాళెం : కీరమందలో విద్యార్థులకు బ్రష్‌లు అందజే స్తున్న ఉపాధ్యాయులు, తవణంపల్లె: పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దాత్రేయచౌదరి

భూమిని ఆక్రమించుకున్నారు

చిత్తూరు రూరల్: తమ సాగులో ఉన్న భూమిని ఆక్రమించుకున్నాడంటూ గంగాధరనెల్లూరుకు చెందిన త్యాగరాజన్, మొగిలయ్య వాపోయారు. వారు సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సర్వే నెంబర్ 559/1లో 2ఎకరాల 22 సెంట్ల భూమిని తాము 70 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నామన్నారని తెలిపారు. అయితే గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ ఇంజం పంచాయతీ చింతారెడ్డిపల్లికి చెందిన చెంగల్‌రాయులు అతని భార్య సరస్వతిపై అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకం చేసుకున్నట్లు తెలిపారు. అయితే వారి వద్ద నుంచి మరో వ్యక్తి ఈ భూమిని తాను కొనుగోలు చేశానని ఈ భూమిలో ఎవరూ ప్రవేశించకూడదని తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

విద్యుత్‌శాఖకు రూ.8.96 లక్షల నష్టం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో ఆదివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్స్, ఇన్సులేటర్లు, డిస్కులు దెబ్బతిన్నాయి. డివిజన్ పరిధిలో మొత్తం 12 స్తంభాలు, 32 ట్రాన్స్‌ఫార్మర్లు, 31 ఇన్సులేటర్లు, 14 డిస్కులు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్‌శాఖకు రూ.8.96 లక్షలు నష్టం వాటిల్లిందని ఇన్‌చార్జి ఈఈ పద్మనాభ పిళ్లై వివరించారు.